ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు
తేదీ: 08-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు
ముఖ్యాంశాలు

- జమ్మూ కశ్మీర్ అసెంబ్లి ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్స్ కూటమి విజయం సాధించింది.
- హర్యానా అసెంబ్లి ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయం దిశగా పయనిస్తుంది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 10,11 తేదీల్లో లావోస్ లో పర్యటించనున్నారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 70వ జాతీయ చలనచిత్ర అవార్డులను ఈరోజు ప్రధానం చేశారు.
- భారత వైమానిక దళం 92వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈరోజు చెన్నై సమీపంలోని తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తొలిసారి జరిగాయి.

జమ్మూ కశ్మీర్ అసెంబ్లి ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తం 90నియోజక వర్గాలకు గాను నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్లో విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ 29 స్థానాల్లోనూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 6 చోట్ల గెలుపొందాయి. జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ 3 సీట్లు గెలుచుకుంది. జమ్మూ కాశ్మీర్ పీపుల్ కాన్ఫరెన్స్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్), ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కో స్థానంలో గెలిచాయి. స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 7 స్థానాల్లో విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా పోటీ చేసిన బుద్గాం, గండేర్బల్ రెండు నియోజకవర్గాల నుండి విజయం సాధించారు. అనంత్‌నాగ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పీర్జాదా మహ్మద్ సయ్యద్ విజయం సాధించారు. కాగా జమ్మూ కశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన మొట్ట మొదటి ఎన్నికలు ఇవి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి స్పష్టమైన ఆధిక్యత రావడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్దమవుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానా అసెంబ్లి ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయం దిశగా పయనిస్తుంది. ఇప్పటివరకు 79 నియోజకవర్గాల ఫలితాలను ప్రకటించారు. భారతీయ జనతా పార్టీ 41 స్థానాల్లోనూ విజయం సాధించి, 7 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 33 స్థానాల్లో విజయం సాధించి, 4 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇండియన్ నేషనల్ లోకదళ్‌కు రెండు సీట్లు వచ్చాయి. మూడు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. బీజేపీ నాయకుడు, ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, లాడ్వా స్థానం నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా రోహ్‌తక్‌లోని గర్హి సంప్లా కిలోయి సీటును గెలుచుకున్నారు. కేంద్రమంత్రి, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలు రాష్ట్ర ప్రజలపై సానుకూల ప్రభావం చూపడమే ఈ విజయానికి కారణమని పేర్కొంటూ..

వాయిస్ బైట్, మనోహర్ లాల్ ఖట్టర్ .. (వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లావోస్ ప్రధానమంత్రి సోనెక్సే సిఫాండోన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 10,11 తేదీల్లో ఆ దేశ రాజధాని వియంటియాన్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా లావోస్ అధ్యక్షత వహించనున్న 21వ ఆసియాన్-ఇండియా సదస్సు, 19వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధానమంత్రి పాల్గొంటారని విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో 2022 సంవత్సరానికి గాను అందించిన అవార్డుల్లో భాగంగా ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తికి సినీ రంగంలో అత్యున్నత గుర్తింపు దాదాసాహెబ్ ఫాల్కే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ, అవార్డు అందుకున్న మిథున్ చక్రవర్తిని అభినందించారు. చలనచిత్ర పరిశ్రమలో ఆయన చేసిన సేవలను ప్రస్తావించారు. అవార్డు పొందిన చిత్రాలను రాష్ట్రపతి ప్రశంసిస్తూ ఈ చిత్రాలు సమాజంలో సానుకూల మార్పును తీసుకువస్తాయని పేర్కొన్నారు.

వాయిస్ బైట్.. రాష్ట్రపతి.. (వాయిస్ 35 సెకన్లు)

జాతీయ చలనచిత్ర అవార్డుల్లోని ఇతర విభాగాలలో, కన్నడ చిత్రం కాంతారాలో అత్యుత్తమ నటనకు రిషబ్ శెట్టి ఉత్తమ నటుడి అవార్డును అందుకోగా, తమిళ చిత్రం తిరుచిత్రంబలం కోసం నిత్యా మీనన్, గుజరాతీ చిత్రం కచ్ ఎక్స్‌ప్రెస్‌కు మానసి పరేఖ్‌కు ఉత్తమ నటి అవార్డు లభించింది. చలన చిత్ర విమర్శకుడు దీపక్ దువాను గోల్డెన్ లోటస్ అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ కూడా పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళం 92వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈరోజు చెన్నై సమీపంలోని తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తొలిసారి జరిగాయి. ఈ సందర్భంగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఈ సంవత్సరం వైమానిక దళం యొక్క యూనిట్ల విశిష్ట ప్రదర్శనలకు ప్రశంసాపత్రాలు, అవార్డులను అందజేశారు. భారత వైమానిక దినోత్సవం సందర్భంగా వైమానిక దళానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని రక్షించడంలో వైమానిక దళం పాత్ర చాలా ప్రశంసనీయమని ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్వర్క్‌తో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణలకు గాను జాన్ హెచ్. హాప్‌ఫీల్డ్, జియోఫ్రీ ఇ. హింటన్‌లకు 2024 సంవత్సరానికి గానూ భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రధానం చేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. జాన్ హాప్‌ఫీల్డ్ డేటాలో ఇమేజ్‌లు, ఇతర నమూనాలను నిల్వ చేయడంతో పాటు పునర్నిర్మించగల సామర్థ్యం గల అనుబంధ మెమరీని సృష్టించారు. జియోఫ్రీ హింటన్ డేటాలోని లక్షణాలను స్వయంప్రతిపత్తిగా చిత్రాలలోని నిర్దిష్ట అంశాలను గుర్తించడం వంటి పనులను చేసే పద్ధతిని కనుగొన్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు అక్టోబర్ 14వరకు కొనసాగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అటల్ పెన్షన్ యోజనకు ఇప్పటివరకూ ఏడు కోట్ల మందికి పైగా నమోదు చేసుకున్నారని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. తాజాగా విడుదల చేసిన సమాచారం మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 56 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఈ సామాజిక భద్రతా పథకం చందాల ఆధారంగా నెలకు వెయ్యి రూపాయల నుండి ఐదు వేల రూపాయల వరకు కనీస పెన్షన్‌ను అందిస్తుంది. భారతీయులందరికీ, ముఖ్యంగా అసంఘటిత రంగంలోని కార్మికులకు సార్వత్రిక సామాజిక భద్రతా వ్యవస్థను రూపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని 2015లో ప్రారంభించింది.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు, చైనా ఉద్దీపన చర్యల వంటి పరిణామాలతో ఆరు రోజులగా వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. తిరిగి లాభాల బాటపట్టాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో దాదాపు 600 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 25 వేల మార్కును చేరుకుంది. రేపటి ఆర్‌బీఐ పరపతి విధాన నిర్ణయాల వెల్లడి నేపథ్యంలో మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెన్సెక్స్ ఉదయం 80,826.56 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై తర్వాత లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 81,763.28 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 584.81 పాయింట్ల లాభంతో 81,634.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 217.40 పాయింట్ల లాభంతో 25,013.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.96గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ రహదారుల మార్గంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావలనే ఉద్దేశంతో కేంద్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ హంసఫర్ పాలసీని ఈరోజు ప్రారంభించారు. ఈ నూతన పాలసీ ప్రకారం పెట్రోల్ పంపుల వద్ద టాయిలెట్లతో పాటు వీల్‌చైర్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, పార్కింగ్, డార్మిటరీ, ఫుడ్ కోర్టు, ఏటీఎం, వాహనాల రిపేరింగ్ షాప్, ఫార్మసీ వంటివి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =